క్లుప్తంగా

మంథనిలో తిరంగా ర్యాలీ



ర్యాలీ తీస్తున్న పోస్టల్ ఉద్యోగులు

మంథని: హర్ ఘర్ తిరంగా 2.0లో భాగంగా మంథనిలో పోస్టాఫీసు ఉద్యోగులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. పోస్టాఫీసు నుంచి గాంధీచౌక్,అంబేడ్కర్ చౌక్, ఆర్టీసీ డిపో వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జయశంకర్ భూపాలపల్లి జెడ్పీచైర్మన్లు పుట్ట మధు, జక్కు శ్రీ హర్షిని, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజకు జాతీయ జెండాను బహూకరించారు. రూ.25 చెల్లించి జాతీయ జెండాలు తీసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ ద్వారా కూడా పొందవచ్చని బుక్‌చేసిన మరుసటి రోజే పోస్ట్‌మాన్ ద్వారా ఇంటికి పంపిస్తామన్నారు. మంథని సబ్‌డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అజహారుద్దీన్, పోస్ట్‌మాస్టర్ రవికుమార్ ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో నికర ఆదాయం



అవగాహన కల్పిస్తున్న ఏవో ప్రత్యూష

జూలపల్లి: రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించే ఆయిల్‌పామ్ తోటల పెంపకంపై దృష్టిసారించాలని ఏవో ప్రత్యూష సూచించారు. కుమ్మరికుంటలో గురువారం రైతులకు ఆయిల్‌పామ్ తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్‌పామ్ తోటల సాగుకు ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ పరికరాలు అందిస్తోందన్నారు. ఐదేళ్లలో అంతరపంటలు సాగుచేయొచ్చన్నారు. తిరుమల ఆయిల్ ఫెడ్ కంపెనీ సీఈవో, ఏఈవోలు, హార్టికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాంత్‌కు సన్మానం



శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న సదయ్యగౌడ్

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని సాంబయ్యపల్లికి చెందిన లంకదాసరి శ్రీకాంత్ ఎస్సైగా ఉద్యోగం సాధించగా వారి తల్లిదండ్రులతోపాటు శ్రీకాంత్‌కు గురువారం బీజేపీ నాయకులు ఏగోలపు సదయ్యగౌడ్ సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మణికాంత్, శ్రీహరి, రాజశేఖర్, సాయిదీప్ ఉన్నారు.

ఆర్జీ–3లో కేంద్ర పర్యావరణ అటవీశాఖ అధికారి పర్యటన



ఆర్జీ–3 ఏరియాలో పర్యటిస్తున్న మంజునాథ్

కమాన్‌పూర్: కేంద్రప్రభుత్వ పర్యావరణ, అటవీశాఖ పరిధిలోని ఇంటిగ్రేటెడ్ రీజినల్ అధికారి డాక్టర్ డి.మంజునాథ్ ఐఎఫ్ఎస్(డీఐజీ) సింగరేణి సంస్థ ఆర్జీ–3 ఏరియాలోని ఓసీపీ–1,2 గురువారం పర్యటించారు. గనుల పరిధిలో అటవీశాఖ అనుమతులు పొందిన భూమిలో చేపడుతున్న పనులకు నిబంధనలు ఏలా ఉన్నాయని పర్యవేక్షించారు. అటవీశాఖ వివరాలు తెలుసుకున్నారు. ఆయనవెంట సింగరేణి అడ్వైజర్ ఫారెస్ట్ సురేంద్రపాండే, జీఎం సుధాకర్‌రావు, జిల్లా డీఎఫ్‌వో శివయ్య, సింగరేణి అధికారులు బైద్య, రఘుపతి, జైనుల్లా బద్దీన్, రాధాకృష్ణ, రాజేందర్, సురేశ్, శ్రీనివాస్, శ్రీనివాసరావు, రమేశ్, ఐలయ్య తదితరులు ఉన్నారు.

ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి



నివాళి అర్పిస్తున్న శ్రీహర్షిణీ, పుట్టశైలజ

మంథని: ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణీ అన్నారు. గురువారం మంథనిలోని బీఎస్ బాంకెట్ హాల్‌లో పుట్టలింగమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో పూలన్‌దేవి జయంతి ఉత్సవాల్లో మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్టశైలజతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను సన్మానించారు. మంథని జెడ్పీటీసీ సభ్యురాలు తగరం సుమలత నియోజకవర్గంలోని మహిళా ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నాయి.

ప్రభుత్వ పథకాలు అందించాలి

- ప్రొటోకాల్ పాటించడంలేదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌పై ఆగ్రహం
- మండలసభలో ఎంపీపీ స్రవంతి



ప్రొటోకాల్ పాటించడంలేదంటూ ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ స్రవంతి

ఎలిగేడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలుచేస్తోందని ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకు అందేలా చూడాల్సిన బా ధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందని ఎలిగేడు ఎంపీపీ తానిపర్తి స్రవంతి అన్నారు. గురువా రం ఎలిగేడు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ స్ర వంతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ని ర్వహించారు. ముప్పిరితోటలో ఒక్కటే రేషన్‌షాపు ఉందని, రేషన్ కార్డుదారుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారని రెండో షాప్ ఏ ర్పాటుకు కృషిచేయాలని సర్పంచ్ ఐలయ్య సభాదృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలోని 295 సర్వేనంబర్‌లో ఎంతమందికి ప్లాట్లను ఇచ్చారో లిస్టుఇవ్వాలని, భూ మి ఆక్రమణకు గురవుతుందని సభాదృష్టికి తీసుకెళ్ల గా లిస్టు అందిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. డ బుల్‌రోడ్డు నిర్మాణానికి టిప్పర్లు మట్టిని తరలిస్తున్నక్రమంలో రాములపల్లి నుంచి సుల్తానాబాద్ రోడ్డు, ర్యాకల్‌దేవుపల్లి నుంచి ఎలిగేడు రోడ్డు పూర్తిగా పా డైందని చర్యలు తీసుకోవాలని ర్యాకల్‌దేవుపల్లి సర్ప ంచ్ సభాదృష్టికి తీసుకెళ్లారు. పంట నష్టపరిహారం పూర్తిగా రైతులకు అందలేదని పలువురు సర్పంచులు సభలో ప్రస్తావించగా మార్చిలో వడగండ్ల వానలకు నష్టపరిహారం రైతుల ఖాతాల్లో జమచేశామని ఏప్రిల్‌లో జరిగిన పంటనష్టం త్వరలోనే రైతుల ఖాతాల్లో జమచేస్తామని ఏవో ఉమాపతి తెలిపారు. దూరప్రాంతం నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు ప్రభుత్వం ట్రాన్స్‌పోర్టు అలవెన్స్ ఇస్తు ందని ఎంఈవో కవిత సభలో పేర్కొన్నారు. ముప్పిరితోట ప్రాథమిక పాఠశాల తరగతి భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని నూతనభవన నిర్మాణానికి సంబంధిత అధికారులు చొరవ చూపాలని సర్పంచ్ ఐలయ్య సభాదృష్టికి తీసుకెళ్లారు. ముప్పిరితోట, ర్యాకల్‌దేవుపల్లి గ్రామాల్లో మిడిల్‌పోల్స్ అవసరం ఉందని వాటిని ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించా లని విద్యుత్ ఏఈని సభలో కోరగా పరిష్కారానికి కృషిచేస్తానని విద్యుత్ ఏఈ పేర్కొన్నారు. నారాయ ణపల్లి శ్మశానవాటికకు విద్యుత్ సౌకర్యం కల్పించాల ని సర్పంచ్ కొండాల్‌రెడ్డి సభాదృష్టికి తీసుకెళ్లారు. ముప్పిరితోటలో ఇంకుడుగుంత బిల్లులు ఇప్పించా లని సర్పంచ్ ఐలయ్య ఏపీవోను సభలో కోరారు. ఐ సీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే కార్యక్రమాలకు ప్రొటోకాల్ పా టించడంలేదంటూ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకళపై ఎంపీపీ స్రవంతి ఆగ్రహం వ్యక్తంచేశారు. మండలంలోని గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహి ంచే తల్లిపాల వారోత్సవాలు, ఇతరాత్ర కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను పిలవడం లేదని ఆగ్ర హం వ్యక్తంచేశారు. మరోసారి సమాచారం ఇవ్వాల ని లేదంటే ఉన్నతాధికారులకు చర్యలకు సిఫారసు చేస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు. మండలంలోని కాలువల మరమ్మతు పనులకు రూ.2కోట్లను ప్రభుత్వానికి ఎస్టిమేషన్ పంపించినట్లు ఎస్సారెస్పీ అధికారి సభలో తెలిపారు. సభలో చర్చించిన అంశాలపై సమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని ఎంపీపీ కోరారు. జెడ్పీవైస్ చైర్మన్ మండి గ రేణుక, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఎంపీటీసీలు లక్ష్మీ, సావిత్రమ్మ, ఎల్లమ్మ,సర్పంచులు కొండాల్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, ఐలయ్య, ఎల్లవ్వ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీఎస్పీతోనే బహుజనులకు భరోసా

- పెద్దపల్లిలో బీఎస్పీజెండా ఎగురవేయాలి
- పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ఉష
- ఓదెలలో కార్యాలయం ప్రారంభం



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న దాసరి ఉష

కాల్వశ్రీరాంపూర్/ఓదెల: బీఎస్పీతోనే బహుజనులకు భరోసా కలిగిందని అధికసంఖ్యలో మహిళలు, బడుగు బలహీన వర్గాలు, పేదప్రజలు బీఎస్పీలో చేరుతున్నారని బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్ దాసరిఉష అన్నారు. గురువారం మండలంలోని పెగడపల్లిలో రజక కులసంఘం నాయకులు, మహిళలు బీఎస్పీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పెద్దపల్లిలో బీఎస్పీ జెండాను ఎగురవేయాలని దాసరి ఉష పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఓదెలలో బీఎస్పీ కార్యాలయంను ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని ప్రధానవీధుల గుండా ర్యాలీతీశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి బీఎస్పీ జెండాను ఎగురవేశారు. పార్టీకోసం అహర్నిశలు కృషిచేస్తున్న వారిని అభినందించారు. గ్రామాల్లో పట్టణాల్లో బీఎస్పీని పటిష్టం చేసేందుకు కార్యకర్తలు కార్యదీక్షతతో పనిచేయాలన్నారు. రజక సంఘం అధ్యక్షుడు తుంగలపల్లి శ్రీనివాస్, సంఘ ఉపాధ్యక్షులు గూడెపు లక్ష్మిరాజం, రాజయ్య, వెంకటేశం, జంగంపల్లి తిరుపతి, హరీశ్, మహేశ్ వనపర్తి రమేశ్, దండు సంపత్, మహిళలు పార్టీలో చేరారు. బీఎస్పీ మండల అధ్యక్షుడు కుమ్మరికుంట రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా మహిళా కన్వీనర్ పూరెళ్ల స్వప్నగౌడ్, నాయకులు కిరణ్, మహిళా కన్వీనర్ శారద, జిల్లా అధ్యక్షుడు గొట్టె రాజు, జిల్లా జోనల్ మహిళా కన్వీనర్ కుమ్మరి సునీత, పూరెల్ల స్వప్నగౌడ్, ఉపాధ్యక్షుడు తోట వెంకటేశ్, కోశాధికారి ఎండీ.రియాజ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దాసరి

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కనుకుల గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో గురువారం చేరగా ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలాజీరావు, సర్పంచ్ పోలు అంజయ్య, రైతు సమితి మండలకోఆర్డినేటర్ రాజమల్లయ్య, కన్వీనర్ మైలారం నారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు ప్రేమ్‌చందర్‌రావు తదితరులున్నారు.





తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చందర్, మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్

ఘనంగా తీజ్ ఉత్సవాలు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 15వ డివిజన్ లంబాడితండాలో తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పాల్గొన్నారు తండావాసులకు శుభాకాంక్షలు తెలుపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్ శంకర్ నాయక్, మాజీ కార్పొరేటర్ మారెల్లి రాజిరెడ్డి, రాజేశ్ పాల్గొన్నారు.

‘గృహలక్ష్మీ’ దరఖాస్తు గడువు పొడిగించాలని ధర్నా



కార్పొరేటర్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

కోల్‌సిటీ: గృహలక్ష్మీ దరఖాస్తులకు గడువు పొడగించాలని డిమాండ్ చేస్తూ రామగుండం కార్పొరేషన్ ముందు గురువారం బీజేపీ కార్పొరేటర్ కౌశిక లత ధర్నా నిర్వహించారు. బీజేపీ నాయకులు పున్నం శశికుమార్, దారంగుల కుమార్, గంగా ప్రసాద్, రాజు,శ్రీనివాస్, మల్లేష్, రాజు పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి: గడువును పెంచాలని కాంగ్రెస్ మండల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేశోరాం కాంట్రాక్ట్ కార్మికసంఘం అధ్యక్షుడు సూర సమ్మయ్య మాట్లాడుతూ గృహలక్ష్మి పథకానికి రేషన్‌కార్డు తప్పనిసరి నిబంధన పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి దరఖాస్తుల పరిశీలన

కోల్‌సిటీ: గృహలక్ష్మీ దరఖాస్తులను శుక్రవారం నుంచి పరిశీలన చేయనున్నట్లు రామగుండం తహసీల్దార్ జి.కుమారస్వామి తెలిపారు. బల్దియాలోని 50 డివిజన్లకు 15 టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్కో టీంకు ఇద్దరిని చెప్పున కేటాయించినట్లు వెల్లడించారు. డిప్యూటీ తహసీల్దార్ కిరణ్, మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ రాయలింగు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు కరుణాకర్, లింగయ్య పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ కోటా నుంచి టికెట్ కేటాయించాలి



గోదావరిఖని: ఐఎన్‌టీయూసీ యూనియన్ కోటా నుంచి రామగుండం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టికెట్ తనకు కేటాయించాలని జనక్‌ప్రసాద్ కోరారు. గురువారం ఢిల్లీలో పలువుర్ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దిగ్విజయ్‌సింగ్, సోనియా గాంధీ సెక్రటరీని వేరువేరుగా కలిసి చర్చించారు. టికెట్ కేటాయింపుకు సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు.

రైల్వే ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న రైల్వే ఉద్యోగులు

రామగుండం: రైల్వే ఉద్యోగులు గురువారం వారి హక్కుల సాధనకు నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐఆర్ ఎస్‌సీఆర్ఈఎస్ సంఘం జనరల్ సెక్రటరీ రాఘవయ్య పిలుపుతో ఎస్‌సీఆర్ఈఎస్ ఎస్‌సీ డి.భుజంగరావు ఆదేశాలతో నిరసన చేపట్టినట్లు ఉద్యోగులు తెలిపారు. జాతీయ రైల్వే ప్రైవేటీకరణను రద్దుచేయాలని, సేఫ్టీ కేటగిరీలో ఉద్యోగాలు పునరుద్ధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామగుండం బ్రాంచ్ చైర్మన్ సంపత్ కుమార్, సెక్రటరీ వీరన్న అజ్మీర, అసిస్టెంట్ సెకండరీ అనిల్‌కుమార్, విజయకుమార్, వర్కింగ్ చైర్మన్ శ్రీధర్ హరికృష్ణ, రవికిరణ్‌రావు, ప్రవీణ్ రమేశ్, సుశాంత్‌కుమార్, సిఅండ్‌డబ్ల్యూ సూపర్‌వైజర్ స్టాఫ్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా సంపత్‌రెడ్డి



పెద్దపల్లిరూరల్: బీజేపీ జిల్లా అధికారప్రతినిధిగా కట్కూరి సంపత్‌రెడ్డిని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు రాజేందర్ తెలిపారు. పెద్దపల్లికి చెందిన సంపత్‌రెడ్డి పార్టీని బలోపేతం చేయడంలో క్రియాశీలకపాత్ర పోషిస్తున్నాడని దీన్ని దృష్టిలోపెట్టుకుని బాధ్యతలు అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రిని కలిసిన తహసీల్దార్



ధర్మారం: తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రజిత కరీంనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా రైతులకు ఇబ్బంది కల్గకుండా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మంత్రి తహసీల్దార్‌కు సూచించారు.

మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడికి సన్మానం



సన్మానిస్తున్న సభ్యులు

జూలపల్లి: అఖిల భారత యాదవ మహాసభ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సందనవేని రాజేందర్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడిగా జూలపల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దారవేని నర్సింహయాదవ్ నియమితులైన సందర్భంగా జిల్లాకేంద్రంలో ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించినందుకు నర్సింహయాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం యాదవ్, యాదవ ట్రస్ట్ అధ్యక్షుడు మారం తిరుపతి యాదవ్, నాయకులు కొమ్మ సతీశ్, రేచవేని సతీశ్ ఉన్నారు.

తహసీల్దార్‌గా బాధ్యతలు



కమాన్‌పూర్: మండల తహసీల్దార్‌గా వీ.మోహన్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సుల్తానాబాద్ తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

సుల్తానాబాద్: సుల్తానాబాద్ తహసీల్దార్‌గా బీ.మధుసూదన్‌రెడ్డి గురువారం బాధ్యతలను స్వీకరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట తహసీల్దార్ పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రజిత ధర్మారం తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. ఎంపీపీ బాలాజీరావు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఫకీర్‌యాదవ్, శంకర్, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్‌గౌడ్ తహసీల్దార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

రహదారి బాగుచేయాలని రాస్తారోకో



సెంటనరీకాలనీ వద్ద రాస్తారోకో చేస్తున్న కార్మికులు, స్థానికులు

కమాన్‌పూర్/రామగిరి: రామగిరి మండలం సెంటనరీకాలనీ వద్ద మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిని బాగు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు, స్థానికులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. రహదారి పనులను కల్వచర్ల శివారు నుంచి బేగంపేట ఎక్స్‌రోడ్డు వరకు పనులు పూర్తి చేయకపోవడంతో రహదారి వర్షాలకు భారీ గుంతలు పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని కార్మికులు, స్థానిక వ్యాపారులు రాస్తారోకో నిర్వహించారు. దీంతె రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు వచ్చి సముదాయించడంతో రాస్తారోకో విరమించారు.

సంక్షిప్త వార్తలు

స్థలం కేటాయించాలి

గోదావరిఖనిటౌన్: గోదావరి నదిఒడ్డున హిందూ శ్మశానవాటిక పూర్తిగా నీట మునిగి మృతదేహాలను దహనం చేసే పరిస్థితి లేదని కావున సింగరేణి ఆర్జీ–1 జీఎం శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని నేడు ఆర్జీ–1 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నట్లు విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, హిందూవాహిని ఆధ్వర్యంలో పిలుపునిచ్చారు.. నేటి ధర్నాకు హిందూ సంఘాలు, హిందూ సమాజం అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి అయోధ్య రవి కోరారు.

సదస్సు వాయిదా

గోదావరిఖనిటౌన్: నేడు పెద్దపల్లి, రామగుండం నియోజవర్గాల్లో జరిగే విశ్వరూప మహాసభ సన్నాహక సదస్సులు వాయిదా వేసినట్లు ఎమ్మార్పీఎస్ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి మంద రవికుమార్ తెలిపారు. మందకృష్ణ మాదిగ ఇతర రాష్ట్రాల పర్యటనల దృష్ట్యా ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. మరో రెండు, మూడు రోజుల్లో సదస్సుల తేదీని ప్రకటిస్తామన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

పాలకుర్తి: మండలకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మాదాసు శంకర్‌ను ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గురువారం పరామర్శించారు. శంకర్ తండ్రి చంద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నేపథ్యంలో ఎమ్మెల్యే పాలకుర్తిలోని శంకర్ ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

12న సన్మానం

మంథని: నా మట్టి నాదేశం కార్యక్రమంలో భాగంగా మంథని నియోజకవర్గంలోని స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను ఈనెల 12న సన్మానించనున్నట్లు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పోతరవేని క్రాంతికుమార్ తెలిపారు. స్థానిక గాంధీచౌక్‌లో నిర్వహించే కార్యక్రమానికి మంథని మాజీ ఎమ్మెల్యే చంద్రుపట్ల రాంరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సునీల్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

ఛలో కోరుట్ల పోస్టర్ ఆవిష్కరణ

కమాన్‌పూర్: ఈనెల 13న జగిత్యాల జిల్లా కోరుట్లలో నిర్వహించే పద్మశాలి ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం రామగిరి మండలం బేగంపేట ఎక్స్‌రోడ్డు వద్ద మార్కండేయ పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఛలో కోరుట్ల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బండారి సదానందం, బొద్దుల జగన్, జడల చందర్, ఒల్లాల మల్లేశ్, గుంటుకు అనిల్, కట్టకోల మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ గణన పూర్తిచేయాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో చేపట్టిన వ్యవసాయ గణన ఈనెల 15 కల్లా పూర్తిచేయాలని ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్ అన్నారు. పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ గ్రామ రైతువేదికలో గురువారం ఏర్పాటుచేసిన వ్యవసాయ భూమి గణన శిక్షణ తరగతులను జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి, లీడ్‌బ్యాంకు మేనేజర్ వెంకటేశ్‌తో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో సేకరించిన వివరాలను నమోదు చేసి నివేదిక తయారుచేయాలన్నారు. సమావేశంలో ఏడీ. వెంకటరమణ, డెప్యూటీ సీపీవో హరికిష్ణ ఉన్నారు.

బల్దియాలో సమస్యలు పరిష్కరించండి

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని ఫైట్‌ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్, ఉపాధ్యక్షుడు రేణికుంట్ల నరేంద్ర, హనుమండ్ల వెంకటేశ్, అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కమిషనర్ సుచరన్‌కు వినతిపత్రం అందించారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటుచేయాలని, డివైడర్ల మధ్య ఏపుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లను తొలగించి పూలమొక్కలు, పండ్ల మొక్కలు పెంచాలని, గోదావరి బ్రిడ్జిపై ఫెన్సింగ్ ఏర్పాటుచేయాలని, నీటి సరఫరా రోజుచేయాలని, మురుగు నీటి శుద్ధికేంద్రాలు ఏర్పాటుచేయాలని కోరారు. పందులు, దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తున్నాయని, అన్ని డివిజన్లలో ఫాగింగ్ చేయాలని కోరారు.

ఆర్మీజవాన్లకు సన్మానం

ఓదెల: మండలంలోని కనగర్తిలో ఆర్మీజవాన్లు కొంద్ర అశోక్, లాక్కారస్ సురేందర్‌ను బీజేపీ ఓదెల మండల అధ్యక్షుడు కారెంగల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానించారు. గురువారం ఆజాదీకా అమృత్ మహోత్సవం ముగింపు, వీరులకు వందనంలో భాగంగా ఆర్మీజవాన్లను సన్మానించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తీర్థాల కుమారస్వామి, ఎంబాడి మల్లేశ్, ఆది సతీశ్, తూడి రాజేందర్, జీదుల రాజయ్య పాల్గొన్నారు.

రిక్వెస్ట్ బస్‌స్టాప్ షెడ్డు ఏర్పాటు చేయండి



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న మేఘస్వామి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామమైన రామగిరి మండలం ముస్త్యాల గ్రామంలోని కొత్త రోడ్డు కమాన్ వద్ద రిక్వెస్ట్ బస్‌స్టాప్ షెడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తుల తరపున కోరుతూ దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కన్నం మేఘస్వామి గురువారం ఆర్జీ–1 ఏరియా జీఎం శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. వర్షాకాలం, ఎండాకాలంలో బస్‌స్టాప్ షెడ్డులేక గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులు వివరించారు. జన చైతన్య సమితి జిల్లా అధ్యక్షుడు రమేశ్, మహేశ్, అంజి వెంట ఉన్నారు.

న్యాయవాది మృతికి సంతాపం

గోదావరిఖనిటౌన్: బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో గురువారం సీనియర్ న్యాయవాది బల్మూరి లక్ష్మీ మనోహర్‌రావు మృతికి సంతాపం తెలిపారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో పలువురు న్యాయవాదులు, నాయకులు మాట్లాడుతూ మనోహర్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్‌గా , సీనియర్ న్యాయవాదిగా అనేక సేవలు అందించారన్నారు. న్యాయవాదులు సమ్మయ్య, శ్రీనివాస్, ఉమర్, కుమార్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ పాటవాల పోటీలు

సుల్తానాబాద్ : ఆల్ఫోర్స్‌లో పంద్రాగస్టు సందర్భంగా ముందస్తు విద్యార్థులకు ప్రతిభాపాటవాల పోటీలు నిర్వహించినట్లు విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పంద్రాగస్టు వేడుకల్లో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. 300 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలి

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని పాత మున్సిపల్ సమీపంలో బందెల దొడ్డి, నైట్‌షెల్టర్ కోసం నిర్మించిన గదులను ఆక్రమించిన ఆక్రమణదారునిపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ సుచరన్‌కు వినతి పత్రం అందించారు. ఓ అధికార పార్టీకి చెందిన నాయకుడు బందెలదొడ్డిని ఆక్రమించుకోవడంతోపాటు అతని కార్ పార్కింగ్ కోసం స్థలాన్ని అక్రమంగా వాడుకుంటున్నాడని, నైట్ షెల్టర్ కోసం నిర్మించిన భవనానికి గ్రంథాలయం అని బోర్డు తగి లించి సొంత కార్యాలయంగా వినియోగించుకుంటున్నాడని ఆరోపించారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని పాత మున్సిపల్ కార్యాలయంలో స్క్రాప్ దొంగతనం జరిగి, రూ.లక్షల అవినీతి జరిగినా విచారణలో పురోగతి లేదన్నారు. ఇప్పటికైనా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆసాల నవీన్, రణవేని సుధీర్‌కుమార్ దబ్బేటి గోపీ కృష్ణ పాల్గొన్నారు.